

తాండూరు: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



పరిగి: వికారాబాద్‌కు తరలివెళ్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు



నవాబుపేట: కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

# మలిదశ ఉద్యమానికి ఊపిరి

- వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా దీక్షా దివస్
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- మార్మోగిన జై తెలంగాణ నినాదాలు
- కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాకారం
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు రోహిత్‌రెడ్డి, కొప్పుల మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్ తదితరులు

తాండూరు, నవంబర్ 29: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమనేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగి 15 ఏండ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు తాండూరులో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని కేసీఆర్ మలుపు తిప్పారని అన్నారు. తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నవంబర్ 29, 2009న చేపట్టిన నిరాహార దీక్షతోనే తెలంగాణ ఉద్యమం ఊపిరి పోసుకున్నదన్నారు. దీంతో స్వరాష్ట్ర సాధన సాధ్యపడిం దన్నారు. ఉద్యమ దీక్షలా రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి బీఆర్ఎస్ మళ్లీ ప్రత్యేక కార్యక్రమాలతో ముందుకు పోతున్నదన్నారు.
రాష్ట్రంలో కాంగ్రెస్, దేశంలో బీజేపీ ఆగడాలను అంతమొందించేందుకు పూనుకున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని అమలు చేసేవరకు ఊరుకోమన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారం చేపడుతున్నదని, అప్పటి వరకు గులాబీ నేతలు కాస్త ఓపిక పట్టాలన్నారు. కాంగ్రెస్ నేతలకు వడ్డీతో సహాబుద్ధి చెబుతామన్నారు. అనంతరం వికారాబాద్‌లో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్యకర్తలతో వెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి

పరిగి, నవంబర్ 29: దీక్షా దివస్ సందర్భంగా వికారాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి పరిగి నుంచి బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి నేతృత్వంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ ఎంపీపీ కరణం అరవిందరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎ.సురేందర్, సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పరిగి నుంచి తరలివెళ్లారు. కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాకారమైందని, ఆనాటి దీక్షను మరోసారి గుర్తు చేసుకొని, నేటి కాంగ్రెస్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతున్నదని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తెలిపారు. ఏడాది కాలంలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్న కాంగ్రెస్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలచే చీత్కారం తప్పదన్నారు.

### ఏం ఒరగబెట్టారని సంబురాలు..

నవాబుపేట, నవంబర్29: దీక్షా దివస్‌ను పురస్కరించుకుని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు జెండాను ఆవిష్కరించినట్లు బీఆర్ఎస్ నవాబుపేట మండల అధ్యక్షుడు అనంతమోళ్ల దయాకర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఏమిటో చూపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మోసపూరిత మాటలు చెప్పి అధికారం చేపట్టి.. పథకాలను అమలుజేయడంలో నిర్లక్ష్యం వహించడం చూస్తుంటే బాధేస్తున్నదన్నారు. రైతులకు ఒరగ బెట్టింది ఏమిలేదు రైతు సంబురాలు చేసుకుంటున్నారు.. వారి పాపం ఊరికే పోదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుభరోసా పదిహేను వేల రూపాయలను ఇస్తామని రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని దద్దమ్మ ప్రభుత్వం రాష్ట్రంలో ఉండటం మనందరి దురదృష్టకరమన్నారు. బీఆర్ఎస్ పార్టీకి నవాబు పేట మండలం కంచుకోట అని వచ్చే సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మా బలం ఏమిటో నిరూపిస్తామన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి ఆయన తెలంగాణ సాధించడంలో చేసిన పోరాటాలను గుర్తుజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్లు శాంతి కుమార్, పురు షోత్తం చారి, ముఖ్య సలహాదారు మందుల విజయ్‌కుమార్, ప్రధాన కార్య దర్శి పోలీస్ మహేశ్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి బి. మాణిక్‌రెడ్డి, కార్యదర్శి పి. మహేశ్, ఉపాధ్యక్షుడు జి. దాసుగౌడ్, యువజన విభాగం కార్యదర్శి గోవర్ధన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కావలి రాజు, కోశాధికారి ఎం. జగన్‌రెడ్డి, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కావలి అంజి, యూత్ ప్రెసిడెంట్ సంతోశ్‌రెడ్డి, సోషల్ మీడియా వినోద్, విద్యార్థి విభాగం అనిల్, అధికారి ప్రతినిధి బుచ్చిరెడ్డి, మల్లేష్, నాగేశ్ బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

### ఉద్యమకారులకు సన్మానం..

కొడంగల్, నవంబర్ 29: దీక్షా దివస్‌ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కొడంగల్ నియోజక వర్గ తెలంగాణ ఉద్యమకారులకు ఘన సన్మానం చేశారు. శుక్రవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, పరిగి, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్‌ల చేతుల మీదుగా తెలంగాణ ఉద్యమకారులు ఎరన్‌పల్లి శ్రీనివాస్, అబ్దుల్ వాహబ్, భీములు, మెట్లకుంట సలీం, సముద్రమ్మ, సలాం, మహేందర్, మడిగ శ్రీనివాస్, సోమనాథ్‌లు సన్మానాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కేసీర్‌ను ఉద్యమ ప్రస్థానాన్ని గుర్తు చేసు కున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారి సంక్షేమానికి సంబంధించి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి, ప్రత్యేక గుర్తింపు కార్డులను ఇచ్చి వారి సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొడంగల్ బీఆర్ఎస్ నాయకులు దామోదర్‌రెడ్డి, మధుసూధన్‌రావు యాదవ్, కోట్ల యాదగిరి, తిరుపతయ్య నారాయణరెడ్డి, రవీందర్‌చారి, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్ : అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి వస్తున్న బీఆర్ఎస్ నేతలు



నవాబుపేట: బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



కొడంగల్ : సన్మానం అందుకొంటున్న కొడంగల్ నియోజకవర్గ ఉద్యమకారులు

## భూసేకరణ నిలిపివేత గిరిజన రైతుల విజయం



విలేకరులతో మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గట్ట్యానాయక్

పరిగి, నవంబర్ 29 : లగచర్లలో ఫార్మా కంపెనీలకు భూ సేకరణను నిలిపివేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం గిరిజన రైతుల విజయమని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, బీఎంపీ జిల్లా అధ్యక్షుడు పాత్లావత్ గట్ట్యానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం పరిగిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను అనేక రకాలుగా భయబ్రాంతులకు గురిచేసినా పోరాటం ఆపకుండా తొమ్మిది నెలలుగా లగచర్ల రైతులు రాజ్యాంగ బద్ధంగా అనేక పోరాటాల ద్వారా భూ సేకరణను ప్రభుత్వం వెనక్కి తీసుకునేలా విజయం సాధించారన్నారు. రైతులకు మద్దతుగా పోరాటంలో లంబాడి హక్కుల పోరాట సమితి, భారత్ ముక్తి మోర్చా, ఐఎల్‌పీఏ, బీఎంపీ సామాజిక ప్రజా సంఘాలను కలుపుకొని నిరంతరం పోరాటం చేసి ప్రభుత్వం మెడలు వంచి భూ సేకరణను వెనక్కి తీసుకునేలా చేసిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి నిర్ణయం తీసుకునే ముందు ప్రజాభిప్రాయం తెలుసుకొని ఆ తర్వాతే ముందుకు సాగాలన్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా తనపై ఎలాంటి దాడి జరగలేదని చెప్పినా, ప్రభుత్వం లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి వారిని విడుదల చేయా లని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన రైతులపై అక్రమంగా లాఠీచార్జీ చేసిన పోలీసులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్, బీఎంపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నేనావత్ హరినాయక్, నాయకులు ముడావత్ బాబ్యానాయక్, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దామగుండం అడవి దగ్ధం ఘటనపై విచారణ జరిపించాలి

వికారాబాద్, నవంబర్ 29 : దామగుండం అడవి దగ్ధమైన ఘటన పై సమగ్రమైన విచారణ జరిపించాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వై. గీత శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దామగుండం అడవిలో 2009 ఎకరాలు నేవీ రాడర్ కేంద్రానికి అప్పగించిన నేపథ్యంలో వీఎల్‌ఎఫ్ కేంద్రం శంకుస్థాపన జరిగి దాదాపు రెండు నెలలు కావస్తుందన్నారు. ఇప్పుడు దామగుండం అడవి లో చెలరేగుతున్న మంటలతో చాలా విలువైన ఔషధ మొక్కలకు జరిగిన నష్టానికి గల కారణాలేమిటి శోధించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్రమైన విచారణ జరిపించాలన్నారు. మంటలు ఎందుకు చెలరేగాయి ఎంత అడవికి నష్టం జరిగింది ... అసలు ఎముకలు కొరికే చలికాలంలో పచ్చని అడవి ఎట్లా దగ్ధం అయింది దీనిపైన ప్రభుత్వం విచారణ జరిపించి అడవి దగ్ధం కావడానికి గల కారణాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



పరిగి, నవంబర్ 29 : పరిగి పట్టణంలోని మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రధానోపాధ్యాయురాలు, ఎంఈవో, డీఈవోలుగా వ్యవహరించగా పలువురు ఉపాధ్యాయుల వలె వ్యవహరించి పాఠ్యాంశాలు బోధించారు. విద్యార్థినులు చక్కటి విద్యాబోధనతో ఆకట్టుకున్నారని ప్రధానోపాధ్యాయులు కనకాచారి వారిని అభినందించారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



దోమ: మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దోమ,నవంబర్ 29 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో వెంకట్, ఎంపీడీవో మహేశ్‌బాబు అన్నారు. మండల కేం ద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం క్వాలిటీతో కూడిన మధ్యాహ్న భోజం అందించే విధం గా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడికి మధ్యాహ్న భోజన నిర్వహకులకు సూచించారు. మధ్యాహ్న భోజన విషయంలో ఎలాం టి ఘటనలు చోటుచేసుకున్నా బాధ్యులపై కఠిన చర్యలు తీసు కోకు న్నట్లు హెచ్చరించారు.అనంతరం పాఠ శాలకు వచ్చిన రైస్ బ్యాగు లను పరిశీలించిన వారు బియ్యం నాణ్యతను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో సోమ లింగం, పాఠశాల ప్రధానోపాధ్యా యుడు, విద్యార్థులు, భోజన నిర్వహకులు పాల్గొన్నారు.
**బషీరాబాద్ :** విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తహసీల్దార్ వెంకటేశ్, మండల పరిషత్ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మైల్వార్, కంసాన్‌పల్లి, నవండ్గి, తదితర గ్రామాల్లోని పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉందని తెలుసుకున్నారు. ఎలాంటి వంటకాలు పెడుతు న్నారని అడిగారు. అనం తరం నిర్వహకులతో, పర్యవేక్షులతో మా ట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని చాలా బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజు పర్యవేక్షించాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలి పారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజ నం అందించాలని వారు పేర్కొన్నారు.

## లక్ష్యంతోనే ముందడుగు

బషీరాబాద్, నవంబర్ 29 : విద్యార్థి జీవితంలో లక్ష్యమనేది చాలా ముఖ్యమైనది, భవిష్యత్‌ను రూపొందించడానికి కలలను నెరవేర్చుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తహసీల్దార్ వెంకటేశ్, మండల పరిషత్ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్రంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌కు మండలంలోని జడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీ, మోడల్ స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి తహసీల్దార్, ఎంపీడీవో హాజరై మాట్లాడుతూ లక్ష్యాన్ని సాధించడానికి ఒక ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకోవడంలోనే సగం విజయం దాగి ఉంటుందని తెలిపారు. టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో జీహెచ్ ఎం హీర్యానాయక్, అరుణజ్యోతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అనిలా, మ్యాథ్స్ ఫోరం కో–ఆర్డినేటర్‌లు రవికాంత్, నాగరాజు, వీరేశం, పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌రాంరెడ్డి, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రవి సుగంధి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్

**కులకచర్ల :** కులకచర్ల మండలంలోని పుట్టపహాడ్ గ్రా మంలో నిర్వహించిన గణిత దినత్సోవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. మండల స్థాయి గణిత పోటీల్లో పుట్టపహాడ్ పాఠశాలకు చెందిన పల్లవి తెలుగుమీడియంలో మొదటి బహుమతి, ఇంగ్లిష్ మీడియంలో శృతి, సాల్వీడ్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని అశ్విని ద్వితీయ స్థానం పొందారు. ఈ సందర్భంగా పలు వురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ గణి తంలో విద్యార్థులు రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు.

### విద్యార్థులే ఉపాధ్యాయులుగా..



కులకచర్ల, నవంబర్ 29 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవ హరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులకు చిన్నతనం నుండే వివిధ రంగాల్లో రాణించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వీరేశం, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమేశ్, తిరుపతిరెడ్డి, సోమ్లు, లక్ష్మి, సంతోషి పాల్గొన్నారు.

### ఎంబీ రికార్డుల పరిశీలన

కులకచర్ల, నవంబర్ 29 : కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లోని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన పనులకు గాను బిల్లులు సక్రమంగా రాలేదని అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల నిర్వాహకులు కలెక్టర్‌కు తెలియజేయడంతో శుక్రవారం డీఆర్డీవో శ్రీనివాస్, ఈఈ ఉమేశ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఎంబీ రికార్డుల పరిశీలన చేశారు. ఖర్చు పెట్టిన దానికంటే డబ్బులు తక్కువ వచ్చాయని తమకు న్యాయం చేయాలని పనులు నిర్వహించిన మహిళా సంఘాల ప్రతినిధులు డీఆర్డీవోను కోరారు. తాము చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఎందుకు పూర్తి స్థాయిలో ఇవ్వడం లేదన్నారు. దీనికి గాను డీఆర్డీవో స్పందిస్తూ బిల్లులు వెరి ఫికేషన్ చేసి నిజమని తెలితే బిల్లులు చెల్లించేందుకు కలెక్టర్‌కు రిపోర్టు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏఈ మణికు మార్, డీపీఎం రామ్మూర్తి పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాల తనిఖీ

బషీరాబాద్, నవంబర్ 29 : వరి కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తహసీల్దార్ వెంకటేష్ అన్నారు. మండల పరిధిలోని నంవాడ్గి, మైల్వార్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. తేమ శాతం ఉన్న రైతుల ధాన్యాన్ని తూకం వేసి పంపించాలన్నారు.

### ఆర్టీసీ ఉద్యోగులకు వన భోజనాలు

పరిగి, నవంబర్ 29: ఆర్టీసీ పరిగి డిపోలో ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములకు శుక్రవారం వన భోజనాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు క్రీడలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు డిపో మేనేజర్ కరుణ శ్రీ బహుమతులు అందజేశారు.

## సైబర్ నేరాలు, ట్రాఫిక్‌పై అవగాహన



పరిగి, నవంబర్ 29 : పరిగి పట్టణంలోని పలుచోట్ల, బస్టాండ్‌లో ప్రయాణీకులకు పోలీసులు సైబర్ నేరాలు, ట్రాఫిక్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల విషయంలో జాగ్రత్తలు అవసరమని సూచించారు. అనేక రకాలుగా మాట్లాడి బ్యాంకు ఖాతాలను కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తుంటారని, ఏ మాత్రం అనుమానం వచ్చినా వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. బస్టాండ్‌లో సైతం విలువైన వస్తువుల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ట్రాఫిక్ విషయంలోను ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వారు పేర్కొన్నారు.

## మందుల కులస్తులందరూ ఐక్యంగా పనిచేయాలి



మందుల కులస్తుల సమావేశంలో పాల్గొన్న పెంద్ర వీరన్న తదితరులు

పరిగి, నవంబర్ 29 : మందుల కులస్తులందరూ ఐకమత్యంతో పనిచేయాలని సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఏపీ ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న పేర్కొ న్నారు. శుక్రవారం పరిగిలో జరిగిన మందుల కులస్తుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఒంటెద్దు అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మగౌరవ సభలో పాల్గొన్న పెంద్ర వీరన్న మాట్లాడుతూ నేటికీ విద్య, ఉద్యోగ, రాజకీయ పరంగా అత్యంత దయనీయంగా జీవిస్తున్న సంచారజాతుల వారం దరు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. సంచారజాతులను షెడ్యూల్ తెగల జాబితాలో చేర్చా లని ఇచ్చిన నివేదికలను కేంద్ర ప్రభుత్వం అమలు చేసే విధంగా పోరాటం చేయాలని అన్నారు. ఇందుకుగాను అందరు సమైక్యంగా పోరాటంలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి రమేశ్, ఒంటెద్దు అశోక్, చిన్న సాయిలు, జెల్లి శ్రీనివాస్, బాల్‌రాజ్, జంగయ్య, పెద్ద మొగులయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.



కొడంగల్, నవంబర్ 29: మున్సిపల్ పరిధిలోని వడ్డర్‌గల్లీ వార్డులో వెలిసిన భూ లక్ష్మి అమ్మవారికి వార్డు వాసులు బోనాల నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనం కుండలను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి బోనం నైవేద్యాలను సమర్పించుకొని, కుంకుమార్చనతో పూజలు నిర్వహించారు.